క్లుప్తంగా

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి



పదవీ విరమణ చేసిన సూర్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థుల ఉన్నతికి కృషి చేసిన ఉపాధ్యాయులను వారు జీవితాంతం గుర్తు పెట్టుకుంటారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు మునిసిపల్ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కేవీబీ సూర్యనారాయణ పదవీ విరమణ సందర్భంగా స్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సూర్యనారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ ఆర్.శ్రీరామ్, హెచ్ఎం జె సుధారాణి, కె.కృష్ణారావు, చిన్నయ్య, వారణాసి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగికి పదవీ విరమణ సత్కారం



సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పోస్టల్ శాఖలో ఎలాంటి రిమార్క్ లేకుండా పని చేసి పదవీ విరమణ చేయడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. భీమవరం పోస్టల్ శాఖ ప్రధాన కార్యాలయంలో మెయిల్ ఓవర్సీగా విధులు నిర్వహిస్తున్న తోట సత్యనారాయణ పదవి విరమణ అభినందన సత్కార కార్యక్రమం శనివారం సాయంత్రం హెడ్ పోస్ట్ ఆఫీస్ ఆవరణలో నిర్వహించారు. సత్యనారాయణ దంపతులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎ.సురేష్ కుమార్, ఐపీఓ బాలసుబ్రమణ్యం, పోస్టుమాస్టర్ ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రం ఎదురుగా శనివారం సాయంత్రం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి నుంచి భీమవరం వెళుతున్న లారీ భీమవరం నుంచి ఉండి వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని ఎదురుగా ఢీ కొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. లారీకి ముందుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగావస్తున్న ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అతనిని స్థానికులు 108 ద్వారా భీమవరం ఆస్పత్రికి తరలించారు.పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. గాయాలపాలైన వ్యక్తి వివరాలు తెలియరాలేదు. దీనిపై తమకు ప్రమాద వివరాలతో కూడిన సమాచారం ఆసుపత్రి నుంచి అందలేదని ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



రన్ ఫర్ జీసస్ 10కే రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం: క్రీస్తు సందేశాలు శాంతిని ప్రబోధిస్తాయని క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ వై.నళినీజాన్‌కుమార్ అన్నారు. సంజయ్‌కిషన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా ఈస్టర్ ముందురోజు నిర్వహించే రన్‌ఫర్ జీసస్ 10కె రన్ కార్యక్రమం శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. థామస్ బ్రిడ్జి వద్ద కార్యక్రమాన్ని ప్రారంభించిన నళినీజాన్‌కుమార్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు పాటించడం ద్వారా మంచినడవడిక అలవడుతుందని అన్నారు. సంజయ్‌కిషన్ మాట్లాడుతూ నరసాపురం ప్రాంతం క్రైస్తవానికి ప్రత్యేకమైందన్నారు. మొగల్తూరు రోడ్డు, బస్టాండ్, స్టీమర్‌రోడ్డు మీదుగా రన్ సాగింది. న్యూలైఫ్ మినిస్ట్రీస్ చైర్మన్ వై.జాన్‌కుమార్, జి.సుధీర్, మైలాబత్తుల శాంతరాజు, జి.ఫాలేమ్‌రాజు, కేఎస్ ప్రకాష్, చదలవాడ జ్ఞానప్రకాష్ పాల్గొన్నారు.

'నేడు మునిసిపల్ పన్నులు కట్టించుకుంటాం'

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఆస్తి, కుళాయి పన్నులు కట్టించుకోవడానికి నేటితో గడువు ముగియనుండడంతో అధికారులు అందుబాటులో ఉంటారని మునిసిపల్ కమిషనర్ విజయసారది తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం మునిసిపల్ కార్యాలయం వద్ద రెవెన్యూ సెక్షన్‌లో సిబ్బంది పన్నులు కట్టించుకోవడానికి అందుబాటులో ఉంటారన్నారు. వడ్డీ మాఫీతో పన్నులు చెల్లించడానికి గడువు చివరి రోజు కావడంతో ఆదివారం కూడా పట్టణ ప్రజలకు వెసులుబాటు కల్పించామని స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్



వీరవాసరం: రాయకుదురులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు మద్దతు తెలుపుతున్న క్షత్రియ యూత్

వీరవాసరం: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలో తోకలపూడి, చింతలకోటిగరువు, రాయకుదురు, వీరవల్లిపాలెం, వీరవాసరం, నందమూరి గరువు, వడ్డిగూడెం, పెర్కిపాలెం గ్రామాల్లో శనివారం ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ముందుగా తోకలపూడి, చింతల కోటి గరువు, రాయకుదురు, వీరవల్లిపాలెం, వీరవాసరం, వడ్డీ గూడెం, పెరికిపాలెం, నందమూరు గరువు, దూసనపూడి తదితర గ్రామాల్లో ఆయన పార్టీ నాయకులు కార్యకర్తలతో మాట్లాడారు. 2019 ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారు కాబట్టి ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు తమ వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందని ఆయన స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో ఆనాడు చంద్రబాబు 600 కి పైగానే హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని, అటువంటి వ్యక్తి నేడు అన్ని పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడి ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని అధికారం నుండి తప్పించాలని ప్రజలకు లేనిపోని హామీలను ఇస్తున్నారని మండిపడ్డారు. అందుకే ప్రజలు చంద్రబాబు, ఆయన కూటమి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. అంతేకాకుండా పార్టీ నాయకులు కార్యకర్తలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ఆయన వెంట టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, గొలగాని సత్యనారాయణ, గెడ్డం భారతి, చికిలే మంగతాయారు, వీరవల్లి శ్రీనివాస్, దాసరి మహాలక్ష్మి, ఎస్.పద్మ కుమారి, నూకల కనకారావు, మద్దాల సత్యనారాయణమూర్తి, పోలిశెట్టి సత్యనారాయణ, కందుల వెంకటేశ్వరరావు, సైదు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంధికి మద్దతు

భీమవరం: నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెంటే తాము నడుస్తామని క్షత్రియ యూత్ వెల్లడించింది. శనివారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో క్షత్రియ యూత్ ఆయనను కలిసి సంఘీభావం తెలిపారు. రెండో పట్టణ జేసీఏ కన్వీనర్ ఏ ఎస్ రాజు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, అభిరుచి రఘు పాల్గొన్నారు.

భీమవరంలో చేరిక

స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన దళిత క్రైస్తవులు 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. ఈ సందర్భంగా దళిత ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ గుడపాటి శాంతరావు, రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ దళిత, దళిత క్రైస్తవుల అభ్యున్నతి ముఖ్యమంత్రి జగన్ తోనే సాధ్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో తలకాయల స్టాన్లీ థామస్, పట్టెం శుభాకర్, జార్జ్, అంబటి ఆశీర్వాదం, కె.ఏసయ్య తదితరులు ఉన్నారు.

ఏఎస్సై సాయిబాబా సేవలు అభినందనీయం



సాయిబాబా దంపతులను సత్కరిస్తున్న ఎస్సై నాళం శ్రీనివాసరావు

పాలకోడేరు: పోలీసు శాఖలో విధులు అంటే కత్తి మీద సాము లాంటిది అలాంటి శాఖలో మూడున్నర దశాబ్దాల పాటు ఎటువంటి రిమార్క్ లేకుండా ఉద్యోగం చేసి పదవీ విరమణ చెయ్యడం గొప్ప విషయమని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పాలకోడేరు ఏఎస్సైగా పనిచేసి పదవీ విరమణ చేసిన జల్లూరు వెంకట సత్యసాయిబాబాకు నిర్వహించిన అభినందన సభలో ఎస్సై పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సాయిబాబా సేవలను కొనియాడారు. ఆయన భావిజీవితం సుఖ సంతోషాలతో గడపాలని ఎస్సై ఆకాంక్షించారు. ఈ సభలో తోటి పోలీసు ఉద్యోగులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్

ఉండి: భగవంతుని ఆశీస్సులతో త్వరలో నిర్వహించనున్న ఎన్నికల్లో విజేతలవుతాయని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ అభ్యర్థులు పీవీఎల్ నర్సింహరాజు, గూడూరి ఉమాబాల అన్నారు. శనివారం మండలంలోని మహదేవపట్నంలో ఉప్పరగూడెంలో భకాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పీవీఎల్, ఉమాబాల శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముదునూరి సుబ్బరాజు, డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, బాలం తులసీ, గుత్తుల వెంకటకృష్ణ, బొక్కా శ్రీను, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండిలో వైఎస్సార్ సీపీకి కంచుకోటను నిర్మిద్దాం



చినకాపవరంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి కంచుకోటను నిర్మిద్దామని నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని చినకాపవరంలో ఆమె ఆత్మీయ సభలో మాట్లాడుతూ ఏ పార్టీలోనైనా కార్యకర్తలు, నాయకులు సమర్ధవంతంగా పనిచేస్తున్నారంటే ఆ నియోజకవర్గంలో పార్టీ పునాదులు బలంగా ఉండి కంచుకోటను ఏర్పాటు చేసుకున్నట్లేనన్నారు. మనమంతా సమష్టిగా పనిచేసి ప్రతిపక్షాలకు రాబోయే ఎన్నికల్లో డిపాజిట్లు దక్కుండా యుద్ధం చేయాలన్నారు. సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా పీవీఎల్ నర్సింహరాజును గెలిపించేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పనిచేయాలన్నారు. ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి వస్తున్న వారిని సోదరభావంతో చూడాలన్నారు. నియోజకవర్గంలో మహిళా ఓట్లు అధికంగా ఉన్నాయని దీనిపై మహిళా నాయకులు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్యెం కృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ పుప్పాల పండు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్, అల్లూరి తమ్మిరాజు, మంతెన సునీల్ వర్మ, వివిధ గ్రామాల కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆదాయ, వ్యయాల నివేదిక ఆమోదం



నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ హైమావతి

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ వ్యయాల నివేదికను శనివారం కౌన్సిల్ సమావేశానికి తీసుకువచ్చారు. సమావేశానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆదాయ వ్యయాలను పీడీ అకౌంట్ ఖాతాల వారీగా కౌన్సిల్‌కు సమాచారం అందించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 1 నాటికి ఆదాయం 2,10,00,998, మార్చి 23 నాటికి ముగింపు నిల్వ మొత్తం రూ. 2,27,66,054 ఉందని సమావేశంలో కమిషనర్ జీ.కృష్ణ మోహన్ వివరించారు. జీత భత్యాల ఖాతాలో ప్రారంభ నిల్వతో ఆదాయం 3,73,36,976, పీడీ అకౌంట్‌లో ముగింపు నిల్వ మొత్తం రూ. 1,30,70,740 ఉందని తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు నిమ్మల నాగు, కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, తిరుమారెడ్డి మాధవి, అప్రపున్నీసా బేగం, మోటుపల్లి కుమారి, దొడ్డి జగదీష్, గేదల అప్పారావు, కోఆప్షన్ సభ్యులు ఎండీ.జక్కీ, గుండుగొలను సావిత్రి, పలువురు ప్రతిపక్ష కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దింట్లమ్మ ఆలయ ప్రతిష్ఠాపన



పెద్దింట్లమ్మ ఆలయ సన్నిధిలో శ్రీరంగనాథరాజును ఆశీర్వదిస్తున్న అర్చకుడు

పెనుగొండ: పెనుగొండ మల్లప్ప దిబ్బలో ప్రసిద్ధిగాంచిన పెద్దింట్లమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం కనుల పండుగగా నిర్వహించారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో దేవాదాయ శాఖ రూ.80 లక్షలతో నూతన ఆలయం నిర్మించారు. మూడు రోజుల పాటు ఆలయం వాస్తు దోష నివారణ, నవగ్రహ శాంతి హోమాలు, ధాన్యాదిశ పూజలు వైభవంగా నిర్వహించారు. అనంతరం పోతురాజు ప్రతిష్ఠాపన, కలశ స్థాపన నిర్వహించిన అనంతరం పెద్దింట్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కట్టా నరేంద్ర, ట్రస్టు బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

గేట్ ర్యాంకర్‌కు అభినందన



లిఖిత్‌రాజ్‌ను అభినంధిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: గేట్–2024 ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 526వ ర్యాంకు సాధించిన పెదశింగు లిఖిత్‌రాజ్‌ను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు శనివారం తన నివాసంలో అభినందించారు. పట్టణంలోని అంకానివారిపాలేనికి చెందిన లిఖిత్‌రాజ్ చెన్నైలోని భారత్ యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ చేశాడు. అక్కడే ప్రాజెక్టు ఇంజనీర్‌గా పనిచేస్తూ ఈ ఏడాది గేట్‌లో ప్రతిభ చాటాడు.

చంద్రబాబును ఓడించడమే దళితుల లక్ష్యం

పెనుగొండ: కులదురహంకారి చంద్రబాబును దళిత వర్గమంతా కలిసి ఓడిస్తామని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ హెచ్చరించారు. శనివారం కొడమంచిలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులును హేళన చేస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సత్వరం క్షమాపణ చేయాలని డిమాండ్ చేశారు. దళిత బడుగు బలహీన వర్గాలపై చంద్రబాబు ఎప్పటికప్పుడు అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. దళితుల ఆగ్రహంతో అధికారం కోల్పోయినా చంద్రబాబు మారలేదని, ఇదే తరహా తీరుతో ఉంటే ఆయనను ప్రతి ఎన్నికల్లో దళితులంతా ఓడిస్తారని స్పష్టం చేశారు.

మ్యానిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేసిన సీఎం జగన్

శృంగవృక్షంలో పీవీఎల్ ఇంటింటి ప్రచారం



శృంగవృక్షంలో ఓట్లను అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహారాజు

పాలకోడేరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అయిదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ప్రజలు ఓట్లు వేసి భారీ మెజార్టీ అందించాలని డీసీసీబీ చైర్మన్, ఉండి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు కోరారు. శనివారం ఆయన శృంగవృక్షంలో పర్యటించి ఓటర్లను కలుసుకున్నారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలోనూ రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. నవరత్నాల పథకాలన్నీ మహిళల పేరున అమలు చేశామన్నారు. గత ఎన్నికల్లో ప్రకటించిన మ్యానిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేయడంతో ప్రజల ముందుకు ధైర్యంగా ఓట్లు అడగటానికి వచ్చామన్నారు. ఎంపీ అభ్యర్థికి ఒక ఓటు, తనకు ఒక ఓటు వేసి గెలిపించి, జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పీవీఎల్ కోరారు. ఎంపీపీ భూపతి రాజు చంటిరాజు, సర్పంచ్ జంగం సూరిబాబు, పార్టీ మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, వైస్ ఎంపీపీలు సోడదాసి నరేష్, ఆదాడ లక్ష్మీ తులసి, వత్సవాయి నారాయణ రాజు, బుంగా రమణబాబు, గునుపూడి పాండురంగారావు, శ్రీనివాస్ నూకల కుమార్, చాబత్తిన రవి, కటిక సాయి, పెన్మత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్ బాబు, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, చెల్లబోయిన పాపారావు, గెడ్డం జోషి, కంకిపాటి అరవింద్, దొడ్డి యోహాను, గరగపర్రు అబ్బులు, కోడూరి నాగేశ్వరరావు, వెంకన్న సర్పంచులు బొల్లా శ్రీనివాస్, భూపతి రాజు వంశీకృష్ణంరాజు, చింతపల్లి వెంకటనారాయణ, ఎంపీటీసీలు మల్లుల సూర్యకళ, కాటూరి శాంత కుమారి, షేక్ పాపా సాహెబ్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దళితులు చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి



బాలకృష్ణ

భీమవరం: దళితులంటే చిన్నచూపుతో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రానున్న ఎన్నికల్లో దళితులతో పాటు అన్ని వర్గాల ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ స్పష్టం చేశారు. శనివారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శింగనమల శాసనసభకు దళితుడైన ట్రిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు వైఎస్సార్ సీపీ టికెట్ ఇస్తే చంద్రబాబు సహించలేక హేళన మాట్లాడం దళితజాతిని అవమానించడమేనన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దళితులు, బీసీలు, మైనార్టీలే కాకుండా అగ్రవర్ణ పేదలపై ఎంతో మమకారం చూపుతున్నారని దీంతో అన్నివర్గాల ప్రజల్లో జగన్‌పై ప్రత్యేక అభిమానం ఉందన్నారు. అయితే దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని హేళనచేసిన చంద్రబాబు నాయి బ్రాహ్మణులను తోకల కత్తిరిస్తానని కించపర్చారని బాలకృష్ణ ఆవేదన వ్యక్తంచేశారు. టిప్పర్ డ్రైవరని అవహేళన చేస్తూ బహిరంగ సభలో మాట్లాడిన చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎన్నికలపై అవగాహన సదస్సు

పాలకోడేరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు కోరారు. శనివారం కోరుకొల్లులో ప్రజలతో ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అల్లరి పనులు చేసి, కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సదస్సు ఈపీఆర్ఓ ఆంజనేయులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం నాగభూషణం నాయుడు, వీఆర్వోలు గ్రామస్తులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: వార్షిక మరమ్మతుల్లో భాగంగా ఉండి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏప్రిల్ 1వ తేదీ సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉండి, వెలివర్రు, చిలకూరు, ఎన్నార్పీ అగ్రహారం, పెదపుల్లేరు, చెరుకువాడ, కలిసిపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

ఈస్టర్ పండుగకు ఘనంగా ఏర్పాట్లు

ఉండి: భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే పండుగను నిర్వహించిన క్రైస్తవ సోదరులు మూడవ రోజు ఆదివారం జరిగే ఈస్టర్ పండుగ కోసం ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.దీనిలో భాగంగా శుక్ర, శనివారాల్లో ఆయా గ్రామాల్లోని క్రైస్తవుల సమాధులను అత్యంత సుందరంగా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. ఇతర దేశాలు, ప్రాంతాల్లో ఉండే ఆయా గ్రామాలకు చెందిన క్రైస్తవులు తప్పనిసరిగా ఈ పండుగలో పాల్గొంటారు. తమ కుటుంబీకులకు చెందిన సమాధులను రెండు రోజులపాటు పరిశుభ్రం చేసి సుందరంగా తీర్చిదిద్దుతారు. ఈస్టరు పండుగను పురస్కరించుకుని ఆదివారం తెల్లవారు జామున ఊరేగింపుగా క్రైస్తవ శ్మశాన వాటికలకు చేరుకుంటారు. అక్కడ నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. సమాధులను వివిధ రకాల పువ్వులు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తారు. ఉదయం 10 గంటల నుంచి ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టరు పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

వీడియో చిత్రీకరణపై కేసు నమోదు

పాలకోడేరు: బాధిత మహిళ ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన భార్య స్నానం చేస్తుండగా జి.ఉమామహేశ్వరరావు సెల్‌ఫోన్‌తో వీడియో చిత్రీకరిస్తున్నాడని గొల్లలకోడేరుకు చెందిన కాటం బాబూరావు ఆరోపించారు. దీనిపై ఉమా మహేశ్వరరావును ప్రశ్నించగా మా యజమాని తీయమన్నాడని, ఆయన చెబితే ఏమైనా చేస్తానని నిర్లక్ష్యంగా బదులివ్వడంతో మనస్తాపం చెంది బాబూరావు పురుగు మందు తాగారు. అతడు భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కాటం బాబూరావు, అతని యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

ఆర్టీసీ డ్రైవర్ కారణంగా ప్రయాణికుల ఇక్కట్లు

ఉండి: కోలమూరు వద్ద కారు, ఆర్టీసీ డ్రైవర్ల మధ్య తలెత్తిన వివాదం ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. శనివారం జరిగిన ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ కోలమూరులో ఉండి వైపు వస్తున్న ఓ కారును కొద్దిగా రాసుకుంటూ వెళ్లాడు. డ్రైవర్ నిర్లక్ష్యానికి కారు యజమాని బస్సును వెంబడించి అడ్డగించాడు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పాటు సిగరెట్ కాల్చి ప్రశ్నించిన వారిపై ఊదడంతో గొడవ మరింత ముదిరింది. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. డ్రైవర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

అదుపు తప్పి డివైడర్ ఢీకొట్టిన కారు

తణుకు: మండలంలోని దువ్వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. భీమవరం నుంచి విజయవాడ వెళుతున్న కారు దువ్వ గ్రామ పరిధిలోని కొత్త వంతెనపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని బెలూన్స్ తెరచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు క్షేమంగా బయట పడ్డారు. ఈ ప్రమాదం కారణంగా ట్రాఫిక్ కిలోమీటర్ మేర నిలిచిపోయింది. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు వెల్లడించారు.